కరెంటు సార్లూ.. కనికరించరూ!

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్
స్పందించని ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది

రామంతాపూర్ : రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ రాష్ట్రాల్లో కాలనీలో వెంటనే పరిష్కరించే అవకాశం ఉన్న చిన్న చిన్న సమస్యలను అధికారుల నిర్లక్ష్యం వైఖరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకుని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తొలగించిన చెట్లకొమ్మలతో ఇబ్బందులు..

రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ బస్తీలు, కాలనీల్లో విడతల వారీగా రోజు ఏదో ఒకచోట విద్యుత్ సరఫరా చేసే తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా వస్తున్నాయని వాటిని పెద్దఎత్తున కత్తిరించి రోడ్లపైనే వేస్తున్నారు. గతనెల రోజుల క్రితం ఓల్డ్ రామంతాపూర్ చౌరస్తా వద్ద కత్తిరించిన చెట్ల కొమ్మలను రోడ్ల మీదే వదిలేయయడంతో దోమలు వ్యాప్తి అధికమై దీంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. వెంటనే చెట్ల కొమ్మల వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం..

ఓల్డ్ రామంతాపూర్ బొడ్రాయి వద్ద విద్యుత్ సరఫరా చేసే స్తంభం కేబుల్ వైర్లతో నిండిపోయి పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించేలా ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- రామంతాపూర్ నెహ్రూనగర్ ప్రధాన రహదారిలో రాధా దేవి అపార్టుమెంట్ ప్రహరీకి ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. చిన్నారుల చేతికందే ఎత్తులో దిమ్మపై దీనిని ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ.. కంచె లేకపోవడంతో పిల్లలు ఆడుకుంటూ.. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే సబ్‌స్టేషన్‌లో ఉన్న ఫ్యూజ్ కాల్ సిబ్బందికి సమాచారం అందించేలా 9490153532 ఫోన్ నెంబరును ఏర్పాటు చేశారు. సదరు నంబరుకు ఫోన్ చేస్తే సిబ్బంది స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.


ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

యమపాశాలుగా కేబుల్ వైర్లు..

రామంతాపూర్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకు ఇంటర్నెట్ కేబుల్ వైర్లు, పిచ్చుక గూళ్ల చుట్టుకుని ఉన్నాయి. ఈ కేబుల్ వైర్లు సరైన పద్ధతుల్లో అమర్చితే ఎవరికీ ఏ ఇబ్బంది లేదు. కానీ అవి యమపాశాలుగా కిందికి వేలాడుతూ వాహనదారుల మెడకు చుట్టుకుంటున్నాయి. ఈ కేబుల్ వైర్లతో పలుసార్లు విద్యుత్ వైర్లకు మంటలు అంటుకుని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. విద్యుత్ సరఫరా చేసే స్తంభాల చుట్టూ బిగించిన కేబుల్ వైర్లు క్రమపద్ధతిలో ఉండేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి..



రామంతాపూర్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిశీలించి ప్రజా ప్రతినిధులు పట్టించుకుని చొరవ తీసుకుని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కరించాలి. అధికారులు చూసి చూడనట్లుగా ఉంటే సమస్యలు మరింత జటిలమయ్యే అవకాశం ఉంది.
– బుర్ర రాజేశ్వర్, ఓల్డ్ రామంతాపూర్


పిచ్చుక గూళ్లను తలపిస్తున్న కేబుల్ వైర్లు, కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

అధికారి లేక.. జీతాలు రాక..

చాదర్‌ఘాట్: అధికారి ఉద్యోగ విరమణ చేయడంతో వేరే అధికారి రాక, మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో మార్కెట్‌కు పర్సన్ ఇన్‌చార్జి ద్వారా సిబ్బందికి వేతనాలు ఇచ్చేవారు. ఇప్పుడు అధికారి పదవి విరమణ చేయటంతో అటు ఉద్యోగులు, ఇటు పెన్షనర్స్ నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఆఫీసు ఖర్చులకు డబ్బులు కావాలన్నా పర్సన్ ఇన్‌చార్జి సంతకం కావాలి. రెండు నెలలైనా పర్సన్ ఇన్‌చార్జి నియమించకపోవడం ఏంటని సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పీవిని నియమించి సిబ్బందికి వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డిమాండ్ల సాధనకు వినతి



మన్సూరాబాద్: పింఛనర్ల డిమాండ్లు నెరవేర్చాలని రాష్ట్ర పింఛనర్ల జాక్ పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సోమిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం అసోసియేషన్ నేతలు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. పింఛనర్లకు ఉచిత హెల్త్‌కార్డు, డీఏ, పీఆర్‌సీలతో పాటు 70 ఏళ్లు పైబడిన వారికి పూర్తి పింఛన్ అందజేయాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో మల్లయ్య, రఘురాం రెడ్డి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తామని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బోనాల పండుగ నేపథ్యంలో చేపట్టిన పనుల్లో భాగంగా సోమవారం ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యతలో రాజీ పడకుండా పనులను సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అమ్మ వారి ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు సంతోష్, దినేష్, సాయియాదవ్, ఉమేష్, వెంకన్న పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు సభ్యులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి పద్మావతినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం జరిగిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌చారి, కోశాధికారిగా పద్మారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రఘునాథ్‌రెడ్డి, మహేష్, జాయింట్ సెక్రటరీలుగా సత్యనారాయణ, జనార్దన్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, రవి చంద్రశేఖర్, నర్సింహారాజు, దేవేందర్‌నాయక్, మహిపాల్‌రెడ్డి, కరంజిత్‌సింగ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

హస్తినాపురం నార్త్‌ఎక్స్ టెన్షన్‌కాలనీ..


ఆనందం వ్యక్తం చేస్తున్న నూతన సభ్యులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా గోదల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.పర్వత్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌యాదవ్, కోశాధికారిగా కొండల్‌రెడ్డిను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కాలనీ ప్రతినిధులు తులసీరామ్‌నాయక్, భరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగునకు కృషి


పనుల ప్రతిపాదనలు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సోమవారం వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ పరిధిలోని అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందజేశారు. వాటర్‌వర్క్స్, సివరేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి అవసరమైన నిధుల విషయమైన ఎండీతో చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడానికి కృషి చేస్తామన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న డీసీ జకియా సుల్తానా

చంపాపేట: పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ జకియా సుల్తానా అన్నారు. సోమవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో ఎంటమాలజీ అసిస్టెంట్ మణి ఆధ్వర్యంలో 'పరిసరాల పరిశుభ్రత..దోమల నివారణ'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులు తమ పాఠ్యాంశాలలో నేర్చుకున్న దోమల పరిణామ దశలు, అవి పెరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలు, నివారణ మార్గాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించి దోమలు రహిత ఇళ్లుగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ పెంటయ్య, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు


ఆక్రమణలను తొలగింపచేస్తున్న ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

చైతన్యపురి: రోడ్లు ఆక్రమించుకోని ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. సోమవారం సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, డీఐ యాదిగిరి, ఎస్ఐ మారయ్యతో కలిసి దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్ లైన్‌లో, సాయిబాబా ఆలయం లైన్‌లో అక్రమంగా రోడ్లను ఆక్రమించిన పండ్ల విక్రయదారులను, షాప్‌లను తీయించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రోడ్లను ఆక్రమించుకుని ఇతరలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్


నీరు నిలిచిన ప్రాంతాల్లో పర్యటిస్తున్న జెడ్సీ

ఎల్‌బీనగర్: రోడ్లపై వర్షం నీరు నిలువకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు.ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని సీతార హోటల్, చింతలకుంట సీఎంఆర్ షాపింగ్ మాల్, అల్కాపురి చౌరస్తాలోని లక్కీ హోటల్, నాగోలు ఆదర్శ నగర్‌లలో సోమవారం ఆయన పర్యటించి వర్షం నీరు నిలుస్తున్న ప్రాంతాలతో పాటు మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద దుర్వాసన వస్తుందనే ఫిర్యాదుల మేరకు అక్కడికెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు నిలుస్తున్న ప్రాంతాలలో ఇప్పటికే మీటర్ డయా పైప్‌లైన్ ఉందని 2 సెంటీ మీటర్ల వర్షం వరకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. పూర్తిస్థాయిలో సమీక్ష జరిపి పైప్‌లైన్ సామర్థ్యం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్ఈ అశోక్‌రెడ్డి, సీనియర్ ఎంటామాలజిస్ట్ రజిని, డీసీ తిప్పర్తి యాదయ్య, ఈఈ రమేష్ బాబు ఉన్నారు.

వైభవంగా ముగిసిన వారాహి దేవి నవరాత్రులు


విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాల పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో నిర్వహించిన వారాహి దేవి నవరాత్రులు సోమవారంతో ముగిసాయి. పీఠాధిపతులు జగద్గురు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకం, కుంకుమార్చనలు, పారాయణలు, అర్చనలు, మహా నక్షత్ర హారతులు నిర్వహించినట్లు ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆలయం నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు హర్కార వేణుగోపాల్, విద్యాశాఖ కమిషనర్ దేవసేన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మునిపల్లె శ్రీనివాస్ వారికి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేపభాస్కర్ రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, నాయకులు ఉపేందర్ రెడ్డి, గణేష్, బండి మధుసూదన్ రావు, లింగస్వామి గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, కిరణ్, శేఖర్ ముదిరాజ్, సురేంద్ర, మహేందర్, సైదులు, శ్రవణ్ అశోక్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకకుండా చర్యలు తీసుకోవాలి


విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని గాయత్రిపురం కాలనీ ప్రధాన రోడ్డు మార్గంలో గాలికి చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడి అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డివిజన్ పరిధిలోని కాలనీలలో చెట్ల కొమ్మలను ఆనుకొని విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయని వెంటనే వాటిపై దృష్టి సారించాలని ఏడీ తిరుపతయ్య, ఏఈ జాన్సన్‌ను కోరారు. ఆయన వెంట చారి, రాంనాథ్‌రెడ్డి, రాములు, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

చాదర్‌ఘాట్: ప్రతీ సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైంది. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదన్నారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ పేర్కొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


రజితను సన్మానిస్తున్న దృశ్యం

నాగోలు: ఎంతో విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దే వారు ఉపాధ్యాయులు మాత్రమేనని, సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని జైపురి కాలనీ ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉప్పల్ మండలం నాగోల్ డివిజన్ పరిధిలోని జైపురి కాలనీలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు రజితకు సోమవారం పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వరలక్ష్మి మాట్లాడుతూ.. మా బస్తీలో పాఠశాలలోని విద్యార్థులకు రజిత చక్కటి విద్యాబోధన చేశారన్నారు. బత్తుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రజిత టీచరు సుమారు 11 ఏళ్లుగా ఈ పాఠశాలలో ఎనలేని సేవలందించారన్నారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొని రజితను సన్మానించారు. ఉపాధ్యాయుడు పద్మారావు, మహిళా సంఘాల నాయకులు రాజేశ్వరి, మౌనిక, అస్మాబేగం పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషిచేస్తా


వీరయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వివిధ సంఘాల నాయకులు

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించి వారి అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. పలు ఉద్యోగ సంఘాల నాయకులు, దివ్యాంగుల సిబ్బంది మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో ముత్తినేని వీరయ్యకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా దివ్యాంగ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై వికలాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. బెంగళూరులో జరగనున్న పారా స్పోర్ట్స్ క్రీడాకారులు, సంఘం నాయకులతో ఆయన సమావేశమై క్రీడల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు.

డ్రైనేజీ, వాటర్ లైన్ల పనులు ప్రారంభించాలి


అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అరుణ సురేందర్‌యాదవ్

నాగోలు: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో డ్రైనేజీ, వాటర్ లైన్స్ పనులను వెంటనే ప్రారంభించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు రాకముందే నాగోల్ డివిజన్‌లోని రామాంజనేయ కాలనీ డ్రైనేజీ లైన్స్, సహదేవ్ సింగ్‌నగర్ వాటర్ లైన్స్, డ్రైనేజీ లైన్స్ పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. నాగోల్ డివిజన్ ప్రతి కాలనీలో డ్రైనేజీ లైన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో చింతల సురేందర్‌రెడ్డి, కేసిరెడ్డి పద్మరెడ్డి, తదితరులు ఉన్నారు.

వైభవంగా జగన్నాథ రథ శోభాయాత్ర


రథశోభాయాత్రలో పాల్గొన్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: భక్తి కుటీర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రారంభమైన జగన్నాథ రథ శోభాయాత్ర వైభవంగా సాగింది. మన్సూరాబాద్‌లోని సాయినాథ్‌కాలనీ నుంచి ప్రారంభమై ఎంఈరెడ్డి గార్డెన్స్, సహారారోడ్డు నుంచి మల్లికార్జుననగర్ కమ్యూనిటీహాల్ వరకు సాగింది. ఈ శోభాయాత్రకు భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి రథయాత్రలో పాల్గొన్నారు. హరేరామ, హరేకృష్ణ నామస్మరణలు, సాంస్కృతిక నృత్యాలతో రథయాత్ర ఆకట్టుకుంది.

ఎంపీ ఈటలకు సన్మానం


ఎంపీ ఈటలను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

వనస్థలిపురం: కులమతాలతో సంబంధం లేకుండా ప్రజల సమస్యలు, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రాత్రి వనస్థలిపురం కర్నాటి గార్డెన్‌లో వనస్థలిపురం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 24 ఏళ్లుగా తెలంగాణ ఉద్యమంలో అడుగుపెట్టినప్పటి నుంచి పద్మశాలీయులతో తనకు అనుబంధం ఉందని అన్నారు. తాను మంత్రి అయిన తర్వాత నేతన్నల సంక్షేమం కోసం కృషి చేశానని గుర్తు చేశారు. పదవులు ఉంటాయి.. పోతాయి కానీ.. మానవ సంబంధాలు శాశ్వతమన్నారు. ప్రజల కోసం ఎంపీగా తన బాధ్యతాయుతమైన పనితీరును కనబరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, ధనుంజయ, జ్ఞానేశ్వర్, వర్ధ లీల, సంధ్యారాణి, రఘురాం, మాధవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం


క్రీడాకారులతో జగదీష్‌యాదవ్, మల్లికార్జునరావు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మన్సూరాబాద్: జాన్సన్‌గ్రామర్ స్కూల్, ఎల్‌బీనగర్-కుంట్లూర్ ఆధ్వర్యంలో సీబీఎస్‌సీఈ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అండర్-14, 17, 19 బాలికల కబడ్డీ పోటీలను జాన్సన్ గ్రామర్ స్కూల్ చైర్మన్ డాక్టర్ మల్లికార్జున్‌రావు, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే బాలురులతో పాటు బాలికలను క్రీడల్లో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ క్రీడతో చురుకుదనం, శరీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలోని సీబీఎస్‌సీఈ పాఠశాలల నుంచి సుమారు 350 విద్యార్థినులు పాల్గొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ రవికుమార్, హబ్సిగూడ జాన్సన్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిల్ ఇజ్రాయేల్, ఉపాధ్యాయులు, సిబ్బంది

చెత్త.. తరలించకుంటే ఎట్లా?



గ్రేటర్ పరిధిలో ఎక్కడ చూసినా చెత్తనే కనిపిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్‌లో కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. హైదరాబాద్ నగరమంతా చెత్తతో నిండిపోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాములు యాదవ్, వెంకట్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, కరుణ, సుమలత, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. –దిల్‌సుఖ్‌నగర్